489) దేసాక్షి/తోడి

ప॥ ఎఱుగువారెరుగుదు రీయర్థము । యెఱుగనివారి కిది యెఱుగనియ్యదు ॥

చ॥ మొదల గలుగువాడే ముందరను గలవాడు । అదన నాతడే పరమాత్ముడు ।
యెదుట గలిగినదె ఇన్నిటా గలిగినది । పదవడి యిదియే ప్రపంచము ॥

చ॥ చెడనిదానికి మరి చేటెన్నడును లేదు । జడిగొన్న దిదియే సుజ్ఞానమార్గము ।
వుడివోగలదెన్నడు వుడివో గలిగినదీ । కడగడనే తిరుగు కర్మమార్గము ॥

చ॥ యెంచి తొల్లినడచేవే ఇపుడును నడచేవి । మంచి శ్రీవేంకటేశ్వరుమహిమ లివి ।
అంచ నిపుడు గానని వల్లనాడు గాననివే । మంచువంటివిషయపుమాయావాదములు ॥